# మూడో కోణం

కథ

-అనిత

## ''పర్సనల్ అసిస్టెంట్ కావలెను''

అర్హతలు- వయస్సు ఇరవై, ఇరవై అయిదులోపు. మంచి పర్సనాలిటీ. అందము, తెలుగు భాషా పరిజ్ఞానము వుండవలెను. పెళ్ళికాని, ఏ బాదర బందీలూ లేని, తెలుగు లిటరేచర్ చేసిన అమ్మాయిలకు ప్రిఫరెన్స్ ఇవ్వబడును. అర్హతని బట్టి ఆకర్షణీయమైన జీతము ఇవ్వబడును.

వాక్ ఇన్ ఇంటర్వ్యూకి ఆహ్వానం- ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు.

అడ్రస్: 363, దీప్తిటవర్స్, సోమాజీగూడ , హైదరాబాదు.

ప్రముఖ రచయిత 'వేదం సద్గుణరావు'' వేయించిన ఆ ప్రకటనని దినపత్రికలో చూసిన సింధూర, సంజయ్‌లు ముఖా-ముఖాలు చూసుకున్నారు.

రేపటితో తెచ్చుకున్న సరుకులు నిండుకుంటాయి. ఎల్లుండికి ఈ ఇరుకు గది కూడా వుండదు.

ముక్కుమీద కోపంతో నిన్ననే, సంజయ్, తనపై ఆఫీసర్‌తో గొడవపడి సస్పెండ్ చేయబడ్డాడు.

''నెసిసిటీ ఈజ్ ద మదర్ ఆఫ్ ఇన్వెన్షన్'' అవసరం అనే కాలనాగుకి తలవంచకపోతే, అది కాటేయక మానదు.

అందుకే ఇద్దరూ మాట్లాడుకుని, వాదించుకుని, చర్చించుకుని ఏదైతేనేం సింధూర ఇంటర్వ్యూకి వెళ్ళటానికి నిర్ణయించుకుంది.

★★★

సమయం ఉదయం పదకొండూ ముప్పై నిమిషాలు. సింధూర అడ్రస్ వెతుక్కుని వెళ్ళేసరికి దాదాపు ఇరవై, ఇరవై అయిదు మంది అమ్మాయిలు వున్నారక్కడ. లోపల ఇంటర్వ్యూ జరుగుతుంది.

రిసెప్షన్‌లో పేరు చెప్పి తన పిలుపుకోసం ఎదురు చూడసాగింది.

ఒక్కసారి హాలంతా కలియచూసింది. అందరూ బాగానే డ్రస్ అయి వున్నారు. వాళ్ళ వయస్సులు అంచనా వేయటం కష్టమే!

లోపల వి.ఎస్.రావు ఇంటర్వ్యూ చేస్తున్నాడు. ప్రస్తుతం అతని ఎదురుగా వున్న అమ్మాయి టాలెంట్లోనూ పోలికల్లోనూ రమాప్రభకి ఎక్కువ శ్రీలక్ష్మికి తక్కువ లెవల్లో వుంది.

''నీ పేరు?'' అడిగాడు వి.యస్.రావు.

''స్వర్ణ'' అందా అమ్మాయి.

''స్వర్ణ'' అంటే అర్థం తెలుసా? అడిగాడు.

''తెలుసండి-బంగారం'' అంది.

''కేజీ ఎంత?'' అడిగాడు.

ఆ అమ్మాయి అర్థం కానట్టు చూసింది.

''సరేలే నీకు జీతం ఎంత కావాలి?'' అడిగాడు.

''ఎంతిచ్చినా పరవాలేదండీ.. మా అమ్మగారు ఈమధ్యే పోయారండీ..నాన్నగారు రిటైర్ అయ్యారు. తమ్ముడి చదువు సాగాలి. ఏదో మీలాంటి వారు దయతలచి ఉద్యోగం ఇస్తే మీ ఋణం...'' అంటూ ఇంకా ఏదో అంటూ వుండగానే.

''చాల్చాలు ఆపు. ఏమిటీ సినిమా కష్టాలు చెబుతున్నావ్? నా ప్రకటన చూడలేదూ? ఏ బాదరబందీ లేని అమ్మాయి కావాలనిచ్చానే! డోంట్ వేస్ట్ మై టైం, యూ కెన్ గో'' అని కఠినంగా అన్నాడు.

ఆ అమ్మాయి బాధగా అడుగులో అడుగేసుకుంటూ నెమ్మదిగా వెళ్ళిపోయింది.

ఇంకో అమ్మాయి లోనికి వచ్చింది.

''నీ వయసెంత'' అడిగాడు.

''పంతొమ్మిది పోనంటుందండీ. ఇరవయ్యేమో రానంటుందండి. నా కొలతలు సూసినోళ్ళందరూ అందాలపోటీకెళ్ళమన్నారండీ. బస్ ఛార్జీలకి డబ్బుల్లేక ఆగిపోయానండి. మీరు 'ఏ' పని సెప్పినా సిటుక్కున సేసేత్తానండి, రాయమంటే రాత్తానండి, రమ్మంటే వత్తానండి. పక్క దులపమంటే దులుపుతానండి, పక్క ఎక్కమంటే ఎక్కుతానండి,. నా బాస సూసి ఏటో అనుకోవద్దండి. నేను పవిత్ర గంగ లాంటి దాన్నండి. ఒక్కసారి పెట్టుకుంటే, పొమ్మన్నా పోనండి, సచ్చేదాక మీ కాళ్ళదగ్గర పడి వుంటానండి, నాకు డాన్సు కూడా ఒచ్చండి. నాకెందుకో మీరు మేఘసందేశంలో నాగేశ్వర్రావుగారి లాగా నేను జయప్రదలాగా కలసి పోతామనిపిస్తుందండి. ఏమంటారు?'' 'బావ-బావమరిది' సినిమాలో సిల్కుస్మితలా వగలుపోతూ అడిగింది చమ్‌కీ.

వి.యస్.రావు గబగబా గ్లాసు నీళ్ళు తాగాడు.

''నువ్వు బయట వెయిట్ చెయ్యి, రిజల్ట్ చెప్తాము'' అన్నాడు.

తర్వాత సింధూర లోపలకు వెళ్ళింది. వినయంగా నమస్కరించింది.

అతని కళ్ళు జిగేల్‌మని మెరిసి, ఆమెకు షేక్ హాండ్ ఇచ్చాడు.

ఆమె సందిగ్ధంగా షేక్ హాండ్ ఇస్తూ అతన్ని చూసింది.

అతనికి 40-45 మధ్య వయస్సు వుంటుంది. మనిషికి ముందర కాస్త బట్టతల. బాగా హెల్దీ ఓల్డ్ బేబీలా వున్నాడు.

'' నీపేరేమిటి?'' అన్నాడు.

''సింధూర'' చెప్పింది.

''వెరీనైస్ అందమైన అమ్మాయికి అందమైన పేరు!'' ఓ బేవార్స్ కాంప్లిమెంట్ విసిరాడు.

''నీ కొలతలు'' ఐమీన్ నీ క్వాలిఫికేషన్స్ ఏమిటి?''

''బిఏ తెలుగు లిటరేచర్ చేసానండి'' వినయంగా అంది.

''నీకు పెళ్ళయిందా'' అనుమానంగా అడిగాడు.

''కా..కా..కాలేదండి!'' అబద్ధమాడటానికి తడబడింది.

''చూడు నా ప్రకటన చూసే వుంటావు. నేను రచయితని. నాకు ఎప్పుడంటే అప్పుడు మూడ్ వస్తూంటుంది. నేను చెప్తోంటే నీవు వ్రాయాలి. నాకు సహజ ప్రకృతిని చూస్తోంటే ఇంకా మూడ్ వస్తోంది. అప్పుడప్పుడూ టూర్‌లకి వెళుతూ వుంటాను. నువ్వు కూడా నాతో రావాల్సి వుంటుంది. నీకేమైనా అభ్యంతరమా? బయట ఎక్స్‌టర్నల్ క్యూ బోలెడు వుంది. నీ నిర్ణయం చెబితే పని త్వరగా అయిపోతుంది. ఏమంటావ్?''

అవసరం ఆమె కళ్ళముందు మెదుల్తూవుంటే, అతని మాటల్లోని ద్వంద్వార్థాన్ని ఏమాత్రం గ్రహించని సింధూర ఆలోచించకుండా ''ఏమీ లేదండీ'' అంది.

''గుడ్ రేపే డ్యూటీలో జాయినవ్వు! జీతం ఐదు వేలు. ఓ.కె. నా '' అన్నాడు.

సింధూర ఆశ్చర్యంగా తలూపింది.

బయట అందరూ రిజల్ట్స్ కోసం ఎదురు చూస్తుంటే, రిసెప్షనిస్టు ఎనౌన్స్ చేసింది-

''క్యాండిడేట్ సెలక్షన్ అయిపోయింది. ఇహ మీరు వెళ్ళవచ్చు'' అని

బయటకు వచ్చిన సింధూరని అందరూ ఈర్ష్యగా చూస్తూ వెళ్ళిపోయారు.

★★★

ఆ రోజు శనివారం.

''నీవు తప్పక వెళ్ళి తీరాలా సింధూ'' ఉక్రోషంగా అడిగాడు ఆమె భర్త సుజయ్.

''అదేంటండీ అలా అడుగుతారు? ఉద్యోగం అన్నాక వెళ్ళాలిగా మరి. అయినా నేనేదో అమెరికాకో, ఏ అండమాన్ దీవులకో వెళ్తున్నట్టు బాధ పడ్తారేం? వైజాగేగా? ఎంత,రెండు రోజుల్లో వచ్చేస్తాను.''

''అంతవరకూ మీరు మన పక్క వీధిలోవుంది చూడండి మెస్- అక్కడ భోజనం చేయండి. ఇంట్లో మాత్రం వంట ప్రయోగాలు చేయకండి సరేనా?'' అంది సింధూర

సింధూర రైల్వేస్టేషన్‌కెళ్ళేసరికి గోదావరీ ఎక్స్‌ప్రెస్ బయలుదేరటానికి సిద్ధంగా వుంది.

ఫస్ట్ టైం లైఫ్‌లో ఎ.సి కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణం చేయటం.

రైలు కదుల్తూ వుండగా ఆమె అనుకుంది-''బాస్ ఎంత మంచివారు తనని కూడా ఎ.సి కంపార్ట్‌మెంట్‌లో తీసుకెళ్తున్నారు'' అని.

మరుసటి రోజు ప్రొద్దుట రైలు దిగి, టాక్సీలో గ్రీన్‌పార్క్ హోటల్‌కి వెళ్ళారు. మిసెస్ అండ్ మిస్టర్ వి.ఎస్.రావు అని అతను రిసెప్షన్ బుక్‌లో పేర్లు రాస్తుంటే ఆమె ఆలోచనలో పడింది.

రూం నెంబర్ 304. డబుల్ కా బెడ్ రూం ఎ.సి. ఎగ్జిక్యూటివ్ సూట్ గది చాలా బావుంది.

''ఏమీ అనుకోకు ఇద్దరికీ ఒకే గది బుక్ చేసానని. నాకు ఎప్పుడు మూడ్ వస్తే అప్పుడు రాస్తాను. నిన్ను మాటి మాటికీ వేరే రూంలోంచి పిలవాలంటే నీకూ ఇబ్బందిగానే వుంటుంది.

పైగా మిసెస్ అని రాయకపోతే ఇంప్రెషన్ బాగోదు..అందుకని..'' అతను వివరణ ఇస్తున్నట్లుగా చెప్తోంటే ఆమె కాదనలేకపోయింది.

సింధూర స్నానం చేసి రెడీ అయి వచ్చింది. అన్యమనస్కంగా ఏదో వీక్లీ చేతిలోకి తీసుకుని పేజీలు తిప్పసాగింది.

''సుజయ్ ఏం చేస్తూ వుండివుంటాడో ఇప్పుడు?'' మనసులో అనుకుంది.

ఇంతలో వి.ఎస్.రావు కూడా రెడీ అయి వచ్చాడు.

ఇద్దరూ భోజనం రూంలోకి తెప్పించుకుని తిన్నారు.

''కాసేపు రెస్ట్ తీసుకో సింధూరా, సాయంత్రం 4 గంటలకి అలా బీచ్ దగ్గర కెళదాం. అక్కడ రాసుకుందాం మన సబ్జక్టు. ఈరోజు చాలా క్రిటికల్ టాపిక్ గురించి ఆలోచించి వ్రాయాలి'' అన్నాడు.

★★★

వైజాగ్‌బీచ్ చాలాఆహ్లాదకరంగా వుంది.

సింధూర, వియస్‌రావులు నిర్మానుష్యంగా వున్న చోట కూర్చున్నారు.

''సుజయ్ తన పక్కనుంటే ఎంత బావుండును'' అని మనసులో అనుకుందామె.

మాటిమాటికీ భర్త గుర్తుకి రావటం, అది ఆమె భర్త చేసుకున్న అదృష్టం. అది వాళ్ళిద్దరి మధ్యా ఎంత మధురమైన అనుబంధం వుందో తెలుపుతుంది.

''రాసుకో సింధూరా'' అన్నాడు వి.యస్.రావు.

ఆమె తెరుకుని పెన్ పేపర్ చేతిలోకి తీసుకుంది.

అతను చెప్తోంటే ఆమె వ్రాయటం మొదలుపెట్టింది.

''నాకు భార్య వల్ల సుఖం లేదు. ఆమెకు అనారోగ్యం. పైగా నస. నామీద విపరీతమైన అనుమానం. నీట్‌గా వుండదు. ఆమె ఎదురుగా వుంటే నా భావుకత కూడా నిర్వీర్యం అవుతుంది. అసలు మా ఇద్దరికీ ఎలా పెళ్ళైందో నాకు అర్థం కాదు. ఏదో పెద్ద వాళ్ళ మనసులని కష్టపెట్టకూడదని అప్పుడు సరే నన్నాను. కానీ పెళ్ళి చేసుకున్నాక తెలిసింది. నేనెంత పొరపాటు చేసానో. అప్పటికే ఆలస్యం అయిపోయింది. కానీ, నిన్ను చూసాక నాలో ఇదీ అని చెప్పలేని స్పందన. నేను ఎలాంటి జీవిత భాగస్వామి కావాలని కలలు కన్నానో, నువ్వు అచ్చు అలానే వున్నావు. కానీ ఒక విధంగా చెప్పాలంటే నా 'ఐడియల్ షీ' వి నువ్వే. నువ్వు ఊ అంటే...'' అంటూ ఆగిపోయాడు.

ఆమె వ్రాయటం ఆపి, ఇంకా ఏదో చెప్తాడు అని ఎదురు చూస్తోంది.

''చెప్పు సింధూరా! ఇది కథ కాదు, నా ఆత్మకథ. ఒక ఆర్టిస్ట్‌గా నాకు ఇన్స్పిరేషన్ కావాలి. అది నువ్వు నాకివ్వగలవు. నన్నూ నా బాధనూ అర్థం చేసుకో, మనిద్దరం కలిసి సహజీవనం సాగిద్దాం. నీకు ఇష్టమేనా?'' ఆమె చేతులు పట్టుకుని దీనంగా అన్నాడు.

సింధూర స్తబ్దురాలై చూస్తూంది అతనివైపు.

ఆమె జీవితంలో మొట్టమొదటిసారి ఇంత పెద్దషాక్‌ని ఎదుర్కోవటం. మనసు చేతనా చేతనావస్థలో క్షణకాలం స్థంభించింది. అతని 'ప్రపోజల్'ని విని జీర్ణం చేసుకోలేక హృదయంలో అగ్నిపర్వతం బ్రద్దలయిన ఫీలింగ్. నెమ్మదిగా తనని తాను కంట్రోల్ చేసుకుని, తేరుకుని అడిగింది-


''ఇదే ప్రపోజల్ మీ భార్య ఇంకొక మగవాడితో పెడితే మీకు ఎలా వుంటుంది?''

అతని ముఖం ఎర్రగా కందగడ్డలా మారింది.

''షటప్! నా భార్య అటువంటిది కాదు'' అన్నాడు కోపంగా.

''అంటే మీ భార్య తప్ప పరాయి వాళ్ళంతా అలాంటి వాళ్ళనా మీ వుద్దేశం, దయచేసి కోపం తెచ్చుకోకండి సార్, మీరు కేవలం ఆ ఊహకే అంత 'రెసిప్రోకేట్' అవుతున్నారే! మరి...''

''నాకు నీతులు చెప్పే అర్హత నీకు లేదు. నేను ఒక ప్రపోజల్ పెట్టాను. నీకిష్టమైతే సరే, లేకపోయినా ఓకే. కానీ, డోంట్ ప్రీచ్ మీ యువర్ ప్రిన్సిపుల్స్. నీ హద్దుల్లో నువ్వుండు. అండర్‌స్టాండ్?'' అన్నాడు.



'సార్ మీకు చెప్పగలిగేటంతటి దాన్ని కాను. నిజమే! మీకున్న మేధస్సు, అనుభవం నాకు లేకపోవచ్చు. కానీ మీ అభిమాన పాఠకురాలిగా చెప్తున్నాను. మీరు రచయిత. మీకు కూడా ఉద్యోగం కోసం వచ్చే స్త్రీల మీద అంత చులకన భావం వుండటం నాకు బాధగా వుంది. మీరు రాసే కథలు మంచి సందేశాన్ని ఇవ్వాలి. మీ జీవన శైలి ఎదుటివారికి ఆదర్శం కావాలి. కవితా, వనితా, విత్తం పూర్వజన్మ సుకృత లబ్ధాలు. అంటారు. మీలో మంచి జ్ఞానం, భావుకత వున్నాయి. వచన కవితా ప్రక్రియని పరిపుష్టం చేసే మానసిక విశ్లేషణ వుంది. ఎక్కడికో వెళితేనే భావుకత పొంగదుసార్! నిజమైన ఆర్టిస్టుకి తనలోని ఉచ్ఛ్వాస-నిశ్వాసలే ప్రేరణను ఇస్తాయి. అతనిలోని నవరసాల స్పందనే అతనికి ప్రకృతిని ఆస్వాదింపచేస్తాయి. నిజమైన భావుకత మీలోవుంటే ఎక్కడికో వెళ్ళి సూర్యోదయాన్ని చూడక్కరలేదు సార్. అది మీ గది కిటికీలోంచి చూసినా అంతే అందంగా కనబడుతుంది. గదిలో వంటరిగా కూర్చున్నా, ప్రపంచాన్ని గూర్చి వ్రాయొచ్చు.

కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్ళా..కాదేదీ కవిత కనర్హం అన్న శ్రీశ్రీగారి కవిత లేదూ...'వేయి ఫిరంగులు పేల్చగల శక్తి ఒక సైనికుడికి వుంటే యుద్ధాన్నే ఆపగల శక్తి ఒక మంచి రచనకు వుంది' అలాగే ఒక సంసారాన్ని నిలబెట్టగలిగే మంచి అంశాలుగల రచనలు వ్రాసి, దేశానికి ఒక వెలుగుబాట వేయండి. మీ మేధస్సుతో లోక కళ్యాణం కోసం కృషి చేయండి. అలాంటి రచనలు చేసి 'కీర్తి, కాంత, కనకం'- ఈ మూడింటికీ మగవాడు దాసుడు' అని చరిత్ర చెబుతున్న మూఢనమ్మకాన్ని నిజం కాదని నిరూపించండి. ఒక పి.యేగా నా హద్దుల్లో నేను చేయగల సహాయం తప్పక చేస్తాను. చివరిగా- ఆర్థికావసరం కోసం 'నాకు పెళ్ళి కాలేదని' చెప్పి అబద్ధమాడి ఉద్యోగంలో చేరాను. నన్ను క్షమించండి. నేను రిజైన్ చేస్తాను. ఐ విష్ యూ ఆల్ ది బెస్ట్ సర్!'' అని లేచి నిలబడింది సింధూర.

వేదం సద్గుణరావు అప్రతిభుడై చూస్తున్నాడు ఆమెను.

ఇంత చిన్న వయస్సులో అంత పెద్ద సత్యాన్ని క్లుప్తంగా చెప్పిన తీరు- అతన్ని ఆశ్చర్య చకితుణ్ణి చేసింది.

ఇల్లాలు అంటే వెలకట్టలేని వస్తువు అని తెలుసుకున్నాడు. తనకి పరిచయమున్న స్త్రీలలో లేని సహజ సౌందర్యాన్ని గ్రహించగలిగాడు. తను వాళ్ళకి లొంగిపోయాడో, వాళ్ళు తనకి లొంగిపోయారో తెలియని 'పేరసైట్' మెంటాలిటీ లోంచి బయట పడాలని నిర్ణయించుకున్నాడు.

సింధూర అతనికి లోకాన్నీ, మనుష్యులని ఒక కొత్త 'పారామీటర్' (మూడోకోణం) లో చూపెట్టింది.

ఇకనుండీ తన రచనలని త్రికరణ శుద్ధితో చేయాలని నిర్ణయం తీసుకున్నాడు.

అతను కూడా లేచి నిలబడి సింధూర వైపు అభిమానంగా చూస్తూ

''నీవు రిజైన్ చేయాల్సిన అవసరం లేదు. ఒక బాస్‌గా, పై అధికారిగా అడగట్లేదుకానీ, నీ పరిధిలో ఒక పీ.యే గా నాకు పూర్తి సహకారం కావాలని అభ్యర్థిస్తున్నాను. ఓకేనా'' అడిగాడు.

ఆమె కూడా అర్థం చేసుకుని అంగీకార సూచకంగా తల వూపింది నవ్వుతూ.

సూర్యుడు అస్తమిస్తున్నాడు.

చీకట్లో కూడా వెలుగునింపుతూ అతని మనస్సులో మళ్ళీ ఉదయిస్తున్నాడు.

★